www.vastavam.in

# వాస్తవం.ఇన్

డిజిటల్ పత్రిక

ఎడిటర్: దండుగుల శ్రీనివాస్

News you can trust

| సోమవారం | 17-03-2025 |

## ఇది ఇందిరమ్మ ఎమర్జెన్సీ

- ఉస్మానియా విద్యార్థులపై ఆంక్షలపై కేటీఆర్ ఫైర్
- కాంగ్రెస్ మేనిఫెస్టోలోని మొదటి పేజీ చదువుకోవాలని హితవు



**వాస్తవం, హైదరాబాద్:**

ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఉస్మానియా యూనివర్సిటీలో నిరసనలకు నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలపై కేటీఆర్ స్పందించారు. ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్య పాలన అందిస్తానన్న ముఖ్యమంత్రి, నిరసనలపై ఉక్కుపాదం మోపడం అత్యంత దుర్మార్గమైన చర్య అని చెప్పారు. ప్రజాపాలనలో నిరసన తెలిపే హక్కును కాపా డాతామని అభయహస్తం మేనిఫెస్టోలోని మొదటి పేజీ, మొదటి లైన్‌లోనే ఇచ్చిన హామీ ఏమైందో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉస్మాని యా వర్సిటీ విద్యార్థులు తమ సమస్యల పరిష్కా రం కోసం రోడెక్కకూడదని అల్టిమేటం జారీచేయడం ఇందిరమ్మ రాజ్యంలోని ఎమర్జెన్సీ రోజులను గుర్తుచేస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు.



## బడ్జెట్‌కు భారీ కోత...!

# ఖజానా ఖల్లాస్...!




## చరిత్ర సృష్టించనున్న లోటు బడ్జెట్..

### కోతలు, వాతలు తప్పవు...

### బడ్జెట్ ముందే ప్రమాద గంటలు మోగిస్తున్న సీఎం...



మ్యాడం మధుసూదన్
(సీనియర్ పాత్రికేయులు..)
9949774458

**మరో రెండు రోజుల్లో చట్టసభల్లో ప్రవేశపెట్టనున్న 11 వార్షిక బడ్జెట్ చరిత్ర సృష్టించనుందా..? బడ్జెట్‌కు భారీ కోత తప్పదా..? సంక్షేమ పథకాలకు కోతలు తప్పవా..? వాస్తవ అంచనాలు తలకిందులయ్యాయా...? అవుననే స్పష్టమైన సమాధానం వస్తోంది ముఖ్యమంత్రి మాటలను చూస్తుంటే. చట్టసభ సాక్షిగా.. స్టేషన్ ఘన్‌పూర్ బహిరంగ సభ సాక్షిగా ఆయన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చేస్తున్న వ్యాఖ్యలు తీవ్ర నిరాశను కలిగించడమే కాకుండా బడ్జెట్ పై ప్రతికూల ప్రభావాన్ని చూపనున్నాయి. అప్పుల మీద అప్పులు.. మిత్తీల మీద మిత్తీల తిప్పలతో సంక్షేమ పథకాల మెడపై కత్తిపెట్టక తప్పడం లేదని గతంలో ఏ ముఖ్యమంత్రిర కూడా అనని విధంగా రేవంత్‌రెడ్డి స్పష్టం చేస్తున్నారు. వాస్తవం డిజిటల్ మీడియా ముందుగా చెప్పినట్టు ... రాష్ట్ర ఖజానాకు కాసుల కటకట మరింత తీవ్రమైనట్టు సీఎం సైతం స్వయంగా ఒప్పుకుంటున్నారు.**

### ఓ సీఎం బడ్జెట్‌పై ఇలా మాట్లాడటం తొలిసారి..!

గత వార్షిక బడ్జెట్ మొత్తం రూ. 2,91,000 కోట్లుగా ప్రవేశపెట్టినప్పటికీ రూ. 70వేల కోట్ల ద్రవ్య లోటు తప్పడం లేదని ఆయన స్పష్టం చేస్తున్నారు. ముఖ్యమంత్రి మాటలు జనవరిలో విడుదలైన కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నివేదిక కంటే కఠినంగా ఉండటం విశేషం. బడ్జెట్‌కు ముందు ఒక ముఖ్యమంత్రి ఇంత తీవ్ర స్థాయిలో ఆవేదన వ్యక్తం చేయడం ఇదే మొదటిసారి. ప్రస్తుత వార్షిక బడ్జెట్‌లో ఆదాయానికి, వ్యయానికి మధ్య ద్రవ్యలోటును దాదాపు రూ.50వేల కోట్లుగా చూపగా అదిప్పటికే రూ. 60వేల కోట్లు దాటింది. ఈ బడ్జెట్ సమాయానికి అది కాస్త రూ. 70 వేల కోట్లకు పెరగనుంది.

### భారీగా తగ్గనున్న బడ్జెట్ సైజు...!

ఈ ద్రవ్యలోటును తగ్గించడానికి ఈసారి ఆదాయాన్ని పెంచుకోవడం, ఖర్చు తగ్గించుకోవడం తప్ప వేరే మార్గం లేదు. ఈ క్రమంలో బడ్జెట్ సైజును కూడా భారీగా కుదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెవెన్యూ ఖర్చులను తగ్గించుకుని పెట్టుబడి వ్యయాన్ని కూడా తగ్గించే పరిస్థితి కనబడుతున్నది. ఇక ఆదాయం విషయాని కొస్తే.. వాస్తవానికి తెలంగాణ ఆవిర్భావం నుంచి కొన్నేళ్ల పాటు కొత్త పన్నుల రాబడి 17 శాతం నుంచి 20 శాతం వరకు స్థిరంగా పెరుగుతూ వచ్చింది. బీఆరెస్ ప్రభుత్వ పతనానికి రెండేళ్ల ముందు నుంచి గ్రోత్ రేటు తగ్గుతూ వచ్చింది. ఈసారి కూడా గతంలో కంటే ఆదాయంలో వాస్తవానికి పెద్ద మార్పులేదు. అన్ని రకాల రెవెన్యూ రాబడులు కలిపి రూ. 2, 91, 000 కోట్లు అంచనా వేయగా అది కాస్తా ఇప్పటి వరకు రూ. 1, 30, 0000 కోట్లకే పరిమితమైంది. సొంతపన్నుల రాబడి కూడా 70 శాతానికే పరిమితమైంది. కేంద్ర పన్నుల రాబడిలో రాష్ట్ర వాటా కొంత ఆశాజనకంగా ఉన్నా.. పన్నేతర రాబడి, కేంద్ర పథకాల కింద రావాల్సిన గ్రాంట్లు.. 25 శాతం లోపు పరిమితమై 70 శాతం మేర గాటా పడింది. గతంలో కూడా ఇదే పరిస్థితి. కానీ ఈసారి సొంత రాబడుల్లో కూడా పెద్దగా వృద్ధి లేకపోవడం గమనార్హం.

### వాస్తవాలను పక్కనపెట్టి బడ్జెట్ సైజు భారీగా పెంచి...!

ఈ క్రమంలో రూ. 2, 91, 000 కోట్లుగా ఉన్న 2024-25 బడ్జెట్‌లో కుదించి 2 లక్షల 70వేల కోట్లుకే పరిమితం చేసినా ఆశ్చర్యం లేదు. వాస్తవాలను పక్కన బెట్టి బడ్జెట్ సైజు భారీగా పెంచడం ప్రభుత్వాలకు ఆనవాయితీగా మారింది. పన్నేతర రాబడిని పెంచి చూపడం, లేని కేంద్ర గ్రాంట్లను భారీగా చూపడం పరిపాటిగా మారింది. కానీ ఈసారి పరిస్థితి అసలే బాగలేదు కా బట్టి.. ఈ అంచనాలను పెంచే పరిస్థితి కనిపిం చడం లేదు. ఈ పరిస్థితిని గమనించిన సీఎం.. ముందే ప్రజలకు హింట్ ఇస్తున్నారు.

### సంక్షేమ పథకాల్లో కోత తప్పదు...!

బడ్జెట్ సైజు తగ్గడంతో పాటు సంక్షేమ పథకాలకు కోత తప్పదని చెప్పకనే చెబుతున్నాడు. వార్షిక బడ్జెట్‌కు ముందే ప్రమాద గంటలు మోగుతున్నాయని చట్ట సభలో, బహిరంగ సభల్లో స్పష్టం చేస్తున్నారు. ఇక జనవరి వరకు రాష్ట్ర ఆర్థిక బడ్జెట్‌కు కాగ్ నివేదిక విడుదల చేసిన లెక్కలు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

ఈ పరిస్థితి ఎందుకొచ్చిందంటే... కేసీఆర్ ప్రభుత్వం అనవసర వ్యయాలతో, అప్పులు తప్పులు అవినీతితో మొత్తం ఖజానాను ఖల్లాస్ చేసిందని బహిరంగంగా చెబుతున్నారు. చరిత్ర సృష్టించే విధంగా బడ్జెట్ సైజును తగ్గించినా ఆశ్చర్యం లేదు.

### కాగ్ నివేదిక చెప్పిందిదీ...!

కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నివేదిక ప్రకారం మొత్తం రెవెన్యూ రాబడి అంచనాలో ఇప్పటి వరకు 55 శాతం రాబడి కూడా రాలేదు. సొంత పన్నుల రాబడి ఇంకా 60శాతం నుంచి 65 శాతం మధ్యే కొట్టుమి ట్టాడుతోంది. మొత్తం రెవెన్యూ రాబడి భారీగా తగ్గింది. అప్పుల శాతం మాత్రం బాగా పెరిగింది. ఆదాయం తగ్గింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్లు.. అంటే రియల్ ఎస్టేట్ ఆదాయం దాదాపు 60 శాతం ఆందోళనకరమైన రీతిలో పడిపోయింది. పన్నేతర రాబడి కేంద్ర ప్రయోజిక పథకాల కింద రావాల్సిన రాబడి కేవలం 20 శాతానికే పరిమితమైంది. ఒక వాణిజ్య పన్నుల, ఆబ్కారీ ఆదాయం మాత్రమే 70 శాతం దాటింది. కేంద్ర పన్నులలో రాష్ట్రం వాటా కింద రాబడి కొంత ఆశాజనకంగా ఉంది. అప్పులు అనుకున్నదానికంటే రూ. 10వేల కోట్లు ఎక్కువగా పెరిగింది. వాస్తవానికి 2024-25 సంవత్సరానికి మొత్తం పన్నుల రూపంలో రూ. 2.21 లక్షల కోట్లు రాబడి వస్తుందని అంచనా వేశారు. అదిప్పుడు కేవలం జనవరి ఆఖరి నాటికి రూ. 1.23 లక్షల కోట్లు మాత్రమే రాబడి వచ్చింది. అంటే ఇది మొత్తంలో 55 శాతంగా ఉంది. సొంత పన్నుల రాబడిలో 65 శాతం మాత్రమే దాటింది. రాష్ట్ర సొంత పన్నులో రూ.1.44 లక్షల కోట్లకుగాను రూ. 90వేల కోట్ల వరకు మాత్రమే రాబడి వచ్చింది. వాణిజ్య పన్నుల వసూళ్లు కొంత ఆశాజనకంగా ఉన్నాయి. వాణిజ్య పన్నుల ద్వారా రూ. 58వేల కోట్ల రాబడి అంచనావేయగా ఇప్పటికే రూ. 42 వేల కోట్లు వసూలైనవి. ఎక్సైజ్, వ్యాట్ విలువ ఆదారిత పన్ను రూపంలో రూ. 33వేల కోట్లకుగాను రూ.26వేలకోట్లు వసూలైనవి. ఇది కొంత ఆశాజనంగా ఉంది. ఇక ఎక్సైజ్ (అబ్కారీ)ద్వారా రూ. 25వేల కోట్లు రాబడి అంచనా వేయగా.. ఇప్పటి వరకు రూ. 15వేల కోట్లు దా టింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ ఆదాయం దారు ణంగా పడిపోవడం రియల్ ఎస్టేట్ వాస్తవ పరిస్తితికి అద్దం పడుతున్నది. రిజిస్ట్రేషన్ల ద్వారా రూ. 18వేల కోట్లు వస్తాయని ఆశించగా జనవరి ఆఖరు నాటికి రూ.5, 800 కోట్లు మాత్రమే వచ్చాయి. ఇది మొత్తంలో 31 శాతంగా ఉంది.

## అప్పుల అరిగిపోయిన రికార్డు..

### అధిగమించలేం... ఆశలు తీర్చలేం...! ఆగమాగమే...

### అంతిమ పరమార్ధమదే...!



(దండుగుల శ్రీనివాస్)

చెవులకు పట్టిన తుప్పు వదిలింది. ఇక రక్త కన్నీరే మిగిలుంది. అదే అరిగిపోయిన రికార్డు విని. అదే అప్పుల లెక్కలు వినీ వినీ. పోయినోడు మంచిగున్నడు. వచ్చినోడూ మంచిగనే ఉన్నడు అధికారం అనుభవిస్తూ. మధ్యలో వచ్చింది జనాలకే. చచ్చింది గొర్రె. ఇది ఇంట్రవెల్లేనట. ఇక మున్ముందు సినిమా ఉందట. ఏం సినిమా..! అదే అప్పుల సినిమా. ఏం చేస్తారట...? మనమెంత అప్పుల పాలైంది. ఏం చూపిస్తారట. మనం ఎంతగా కోలుకోలేకుండా అప్పుల ఊబిలో కూరుకుపోయింది. ఇదంతా ఎవడికి లాభమట. ఎవడింటాడట. ఎవడికి కావాలట. వింటేనే కదా అసలు సంగతి తెలిసేది. తెలిస్తే. తెలిస్తే మాటికి మాటికి మాకేటీ మాకేటీ అని అడుగరు కదా. మేమేమన్నా గొంతెమ్మ కోర్కెలేమన్నా కోరితమా ఎట్లా..? ఇచ్చిన హామీలే కదా. నోటి వెంట చెప్పి మాటలే కదా. అవును. అప్పుడు చెప్పిండు. ఇప్పుడు ఇల్లుగుల్లంటుండు. అయితే..! మేంమేం కావాలె. తాగుబోతు జాతిపితను రోజూ తిట్టాలె. తిడితే. ఇన్ని అప్పులెందుకు చేసినవని గల్లాపట్టి అడగాలె. అడిగితే. నువ్వు చేసుట్లనే మాకు ఏ పథకాలు అందుతలేవని నిలదీయాలె. కడిగియాలె. తరిమికొట్టాలె. బొందపెట్టాలె. అప్పుడిస్తవ. కాదు అప్పులుతేను. మరి అప్పులు తేకపోతే ఎట్లా గడిచేది ఇల్లు. ఇప్పటికే అప్పుల కోసం అప్పులు తెచ్చి తిప్పలు పడితి ఇంత చెప్పినా చెవికెక్కలే. మరి అభివృద్ధి, పథకాలు. సంపద సృష్టిస్తా. ఎప్పుడు. జర నిదానంగా. ఓపిక పట్టాలె. ఇంకెన్ని రోజులు. పదేండ్లు అధికారంలో ఉండి లక్ష కోట్లు సంపాదించినోన్ని అడుగతలే గానీ నన్ను దబాయిస్తున్నరా..? నువ్వే కదా అన్ని మాటలు చెప్పినవ్. నమ్మి ఓట్లేసినం. అవును.. నేను కూడా ఏదో చేద్దామనుకున్నా. ఇట్లుందని ఎవనికి తెలుసు. గవన్నీ తెల్వద్. మాకు కావాలె. మాయి మాకు కావాలె. అప్పులు తేనంటవు. అప్పు ముప్పంటవు. అప్పులు తెచ్చినోడి గురించి రోజు చెబుతా పోతే మాకొచ్చేదేంటీ చిప్ప చేతికి తప్ప. ఇంట్రవల్ తరువాత సినిమాకు శుభంకార్డు పడతదా..? లేకపోతే అప్పు చేసి పప్పు కూడా తినొద్దని హితవు పలుకులతో ముగింపేనా. అప్పటి వరకు వేచిచూడాలె. మరి అప్పటిదాకా రోజులెట్లా గడవాలె. అప్పులిచ్చెటోడు కూడా దొర్కుతలేడాయె. నమ్మకమే లేకపాయె ఆనికి. అప్పిస్తే వీడెట్ల తీర్చుతడు ఈ సర్కార్లని. ఒక్కటర్థమైంది మొత్తానికి. అప్పుల కుప్పల రాజ్యంల చిప్పల బతుకులు ఇక తప్పవని.




# తాగుబోతు...!

## లక్షకోట్లు సంపాదించినోడు..!!

- వందల ఎకరాల ఫామ్‌హౌజ్‌లో పన్నోడు...!!
- తెలంగాణ జాతిపితెట్లైతడు...!

**వాస్తవం ప్రధాన ప్రతినిధి - హైదరాబాద్:**



పాపం... ఇగ నుంచి గులాబీపార్టోళ్లు కేసీఆర్‌ను తెలంగాణ జాతిపిత అననీకే దడుచుకుంటరు. ఆ ఒక్కమాటన్నందుకు మల్లా అర్సుకున్నడు రేవంతు. ఏకంగా బహిరంగ సభల్నే ఇష్టమొచ్చినట్టు పొట్టుపొట్టు తిట్టిన తిట్లకే చెవులు మూసుకోవాల్సి వచ్చింది హరీశుకు. నీయవ్వ అనవసరంగా అని అనిపించుకున్నట్లైంది లే అనుకున్నడు. ఆ ఫామ్‌హౌజ్ ల ఉన్న కేసీఆర్ కు కూడా భగ్గ కోపమే ఒచ్చుంటది హరీశుపైన. అరే ఉన్నకాడుండక. మధ్యన నా ముచ్చటెందుకు తీసినవ్ రాబై. తీస్తే తీస్తివి. జాతిపిత గీతిపిత గీ పీతల లొల్లెందుకురా నీకు. ఇప్పుడు గీవి అవసరమా..? అని కస్సున లేచుంటడు. ఒక్క మాట జాతిపితన్నందుకు. తాగుబోతన్నడు. వందల ఎకరాల్లో కట్టుకున్న ఫామ్‌హౌజ్ ల పన్న అన్నడు. లక్ష కోట్లు సంపాదించన అన్నడు. గా క్యాప్సికం పండిస్తే కోట్లొస్తయన్నవ్ కదా గా ముచ్చట చెప్పు జెర మా పోరలను పంపుతా అని జనం ముందట ఇజ్జత్ తీసిండు కదరా హరీశు. అని శానా బాధపడి ఉంటడు గులాబీ జాతిపిత. అయినా రేవంతు. అంటే అన్నా అంటవ్ గానీ. సీఎంను పట్టుకుని ఇట్ల అంటర. బట్టలిప్పి కొడతానంటివి. మరి మాజీ సీఎంన పట్టుకుని నువ్విట్ల అనొచ్చున. అరె తాగనోడువున్నడు బై. జరంత పొద్దుగూకంగ తాగుతుండొచ్చు. గాయింతదానికి తాగుబోతోడు. మందు వాసన చూడందే నిద్ర లేస్తడా..? అరె గింత అన్నాళమా మరీ. ఇట్ల అనుడేంది బై. ఇది ఇంట్రవెల్ మాత్రమే.. సినిమా చూపిస్త మామ అంటున్నవ్. ఇంకెన్ని దినాలు గీ ముచ్చట జెప్తవ్ బై. నువ్వు జూపిచ్చే సిన్మల ట్విస్టులేమీ లేవు. అంత ఉత్త ముచ్చట్లేనని ప్రేక్షకులకు సమజైపోకముందే అబీ క్లైమాక్స్ బాకీ హై అని ఊరించకు ఇగ. లేకపోతే గీ సిన్మ అట్లర్ ప్లాపయిద్దిమల్లా.